క్లుప్తంగా

విద్యార్థినులకు కళ్లజోళ్ల పంపిణీ



విద్యార్థినులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వి.విజయ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొత్తం 425 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు చేశారు. అందులో 37 మంది విద్యార్థినులకు దృష్టి లోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వారికి జాయింట్ కలెక్టర్ నిషాంతి కళ్లజోళ్లను అందజేశారు. ఆకు కూరలు ఎక్కువగా భుజిస్తూ కంటిచూపును సంరక్షించుకోవాలని వైద్యులు విద్యార్థినులకు సూచించారు.

ఎఫ్-త్రీ ఫౌండేషన్ ప్రతినిధులకు సత్కారం



జానీని సత్కరిస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు

అమలాపురం టౌన్: పలు సామాజిక సేవలందిస్తున్న అమలాపురం ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్ (ఎఫ్-త్రీ) ఫౌండేషన్ ప్రతినిధులను ఇమ్మిడివరప్పాడులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమం నిర్వాహకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ ఆశ్రమంలోని వృద్ధులకు సంస్థ ప్రతినిధులు నాలుగేళ్లుగా ప్రతి గురువారం ఆహారాన్ని అందిస్తున్నారని వృద్ధాశ్రమ నిర్వాహకుడు విక్టర్ తెలిపారు. ఆశ్రమం 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ అబ్బానీ(జానీ), ప్రతినిధులు భరద్వాజ్, ఆది, నరేష్, కిషోర్, మాలిమ్‌ను సత్కరించారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి



ఏఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అల్లవరం: శెట్టిబలిజ మహిళలను, కులపెద్దలపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అల్లవరం శెట్టిబలిజ సంఘం డిమాండ్ చేసింది. సంఘ నాయకులు బొక్కా శ్రీనివాస్ నివాసంలో శుక్రవారం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ, కువైట్‌లో జీవనోపాధి పొందుతున్న పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం ప్రాంతానికి చెందిన కొల్లబత్తుల శివకుమార్‌తో పాటు, మరో ఐదుగురు శెట్టిబలిజలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. పోస్టులు పెట్టిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకోవాలని అల్లవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై శివారెడ్డికి ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



యానాంలో నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు

యానాం: బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని, ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో శుక్రవారం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. బ్యాంకు ఉద్యోగులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, అవుట్ సోర్సింగ్ నియామకాలను నిలుపుదల చేయాలని వారు కోరారు.

1 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



యానాంలో కొలువైన మీసాల వెంకన్న

యానాం: చారిత్రక శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామి(మీసాల వెంకన్న) కల్యాణోత్సవాలను వచ్చే నెల 1 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనోత్సవాల్లో నిత్యం వివిధ వాహనాలపై స్వామివారికి ఊరేగింపు, ధ్వజారోహణం జరుగుతాయి. 11న దివ్యకల్యాణం జరుగుతుందని ఏఓ కె.రామకృష్ణ తెలిపారు.



మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



ప్రత్యేక రథంపై ఊరేగింపు (ఫైల్)



వీరేశ్వరునికి ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం (ఫైల్)



ఆలయంలో శూలాల సంబరం (ఫైల్)

మహా పవిత్రం.. శివనామ స్మరణం

- ముస్తాబవుతున్న మురమళ్ల వీరేశ్వరుడు
- మహా శివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు
- భారీగా పందిళ్లు, స్వాగత ద్వారాలు, విద్యుద్దీపాలంకరణ

ఐ.పోలవరం: ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాల్లో ఒకటి మురమళ్ల పుణ్య క్షేత్రం. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి శైవ క్షేత్రం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్తాబవుతోంది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో, భారీ పందిళ్లు, రహదార్లపై విద్యుద్దీపాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఐదు రోజుల పాటు..

మహా శివరాత్రి ఉత్సవాలు వీరేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజుల పాటు జరగనున్నాయి. సుమారు లక్ష మంది ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 26 నుండి మార్చి 2 వరకూ ఉత్సవాలు జరుగుతాయి. నిత్యం స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేయనున్నారు.

మహా శివరాత్రి శుక్రవారం రావడంతో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని బుధవారం ఉదయం 4 గంటల నుండి స్వామివారి దర్శనాలు, అభిషేకాలు, కుంకుమ పూజలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక ప్రవచనం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 నుండి 4 గంటల వరకు దేశంలో ఏటా జరిగే పుష్కరాల నుంచి ద్వాదశ పుష్కర నదీ (గంగ, యమున, నర్మద, సరస్వతి, సింధు, ప్రణీత, భీమరథీ, పుష్కరిణి, తుంగభద్ర, గోదావరి, కృష్ణా, కావేరి) జలాలతో అభిషేకం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు శూలాల సంబరం, బాజా భజంత్రీలతో, బాణసంచా కాల్పులతో, నాదస్వర బృందాలతో ధూపసేవ, జ్యోతిర్లింగార్చన, అనంతరం నందాదీపం ప్రజ్వలన జరుగుతుంది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలదర్శనం, అనంతరం స్వామివారికి, అమ్మవారికి మహా నివేదన ఉంటుంది. 27న శుక్రవారం ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమం, 28న ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు, రాత్రి భక్తి గీతాలు, మార్చి ఒకటిన ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమం, చివరి రోజు రెండున ఆదివారం ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజలు, సాయంత్రం ఐదు గంటలకు రుంజలతో, బ్యాండ్ మేళాలు, కోలాటాలతో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపుతో వృద్ధ గౌతమీ గోదావరికి తీసుకొస్తారు. అనంతరం గోదావరిలో విద్యుద్దీపాలు, పచ్చిపూలతో అలంకరించిన హంస వాహనంపై తెప్పోత్సవం జరగనుంది.



గౌతమీ గోదావరిలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి తెప్పోత్సవం (ఫైల్)

పటిష్టంగా ఏర్పాట్లు



రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా ఉన్న భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే దేవదాయ శాఖ అధికారులు పనులు పరిశీలించి, భక్తులకు మెరుగైన సేవలు, దర్శనం కలిగేలా సూచనలు అందజేశారు. ప్రత్యేక క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ద్వాదశ పుష్కర నదీ జలాభిషేకం, చివరి రోజు గోదావరి మాతకు పంచ హారతులు, తెప్పోత్సవం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– మాచిరాజు లక్ష్మీనారాయణ, ఆలయ ఈఓ

హోటళ్లపై తనిఖీలు వద్దంటూ సిఫార్సులా?

- కూటమి నేత ఫోన్‌కు స్పందించని అధికారులు

అమలాపురం టౌన్: పట్టణంలో ఆహార నియంత్రణ అధికారుల బృందం ఓవైపు హోటళ్లలో తనిఖీలు చేస్తుంటే, నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకుడు, ప్రజాప్రతినిధి ఆ అధికారులకు ఫోన్ చేసి వద్దని చెప్పేందుకు యత్నించడంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆహార నియంత్రణ అధికారుల బృందం పలు హోటళ్లను గురువారం తనిఖీలు చేస్తుండగా, కూటమి నాయకుడొకరు ఓ అధికారికి ఫోన్ చేసి, సిఫార్సు చేసేందుకు ప్రయత్నించారు. అలా వచ్చిన ఫోన్‌ను ఓ హోటల్ వద్ద ఉన్న మరో కూటమి నాయకుడు ఆ అధికారికి ఇవ్వబోతే, ఆయన 'నేను మాట్లాడను' అని బదులివ్వడంతో వారు కంగుతిన్నారు. హోటల్‌లో ఆహార పదార్థాలు నిల్వ చేసినవి, అపరిశుభ్రతతో దారుణంగా ఉన్న తరుణంలో, ఆ నాయకుడు సిఫార్సు చేసేందుకు యత్నించడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కూటమి నేత ఫోన్‌కు స్పందించకుండా, పలు హోటళ్లపై కేసులు పెట్టి, నోటీసులిచ్చి, తమ పని పూర్తి చేసిన ఆహార నియంత్రణ అధికారుల బృందాన్ని ప్రజలు అభినందిస్తున్నారు.

కాశీ మృతికి ఎమ్మెల్సీ సంతాపం

అమలాపురం టౌన్: విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్, బ్యాడ్మింటన్ రిఫరీ రంకిరెడ్డి కాశీవిశ్వనాథం ఆకస్మిక మృతికి ఎమ్మెల్సీ డాక్టర్ పండుల రవీంద్రబాబు శుక్రవారం సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి, పరామర్శించారు. కాశీ తనకు మంచి మిత్రుడని చెప్పారు. ఆయన సూచనలు, పర్యవేక్షణతో తాను ఎంపీగా పలు క్రీడాభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని విలపించారు. కాశీ కుమారుడైన సాయిరాజ్ సాత్విక్‌ను అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు.

దేశానికి ఆణిముత్యాన్ని అందించిన కాశీ

- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: తనయుడు సాయిరాజ్ సాత్విక్‌ను అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా తీర్చిదిద్ది, దేశానికి ఆణిముత్యం అందించిన తండ్రి రంకిరెడ్డి కాశీ విశ్వనాథం ఆకస్మిక మృతి క్రీడాలోకానికి తీరనిలోటని మాజీ జాతీయ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురం సూర్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా స్థలంలో శుక్రవారం జరిగిన దివంగత రంకిరెడ్డి కాశీ సంతాప సభలో ఆయన మాట్లాడారు. ఎందరినో పీఈటీలు, పీడీలుగా చేసిన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కాశీ అని కొనియాడారు. మారుమూల పల్లెలో పుట్టిన కాశీ.. ఇండియన్ వాలీబాల్ క్రీడాకారుడిగా ఎదిగి, పీఈటీగా, పీడీగా, హెచ్ఎంగా చేసిన సేవలను కోనసీమలోని ప్రతి క్రీడాకారుడు గుర్తుంచుకుంటాడన్నారు. తనయుడు సాయిరాజ్ సాత్విక్ న్యూఢిల్లీలో అవార్డు తీసుకుంటున్న అపూర్వ దృశ్యాలను స్వయంగా వీక్షించాలని బయలు దేరిన కాశీ, అదే ఆయన జీవితానికి తుది రోజు కావడం బాధాకరమన్నారు. దివంగత కాశీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన ఆత్మశాంతికి ఎమ్మెల్సీతో పాటు, వాకర్స్, క్రీడాకారులు రెండు నిమిషాల మౌనం పాటించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు దండుమేను రూపేష్, కుడుపూడి త్రినాథ్, చప్పిడి శోభన్‌బాబు, షేక్ అబ్దుల్ ఖాదర్, అడపా రాము తదితరులు కాశీ క్రీడా సేవలను కొనియాడారు.



కాశీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, వాకర్స్ ప్రతినిధులు

డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలింపు తగదు

- వ్యతిరేకించిన మున్సిపల్ కౌన్సిల్
- సందర్శించిన చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అసలే అరకొర స్థలంతో చెత్తకుప్పలు కొండలుగా మారి, స్థలం కొరతతో అవస్థలు పడుతున్న అమలాపురం మున్సిపల్ డంపింగ్ యార్డ్‌కు పట్టణ సమీపంలో ఉన్న నాలుగు గ్రామాల నుంచి చెత్తను ఇక్కడకు తరలించడం తగదని మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీలకతీతంగా వ్యతిరేకించారు. డంపింగ్ యార్డ్‌ను ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక సమస్యలు, యార్డ్‌లోని చెత్తకు నిప్పు పెట్టడం వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇబ్బందులపై కౌన్సిలర్లు స్పందించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ మూడు అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం చైర్‌పర్సన్ సహా, 30 వార్డుల కౌన్సిలర్లు డంపింగ్ యార్డ్‌కు వెళ్లి, అక్కడి సమస్యలను వీక్షించారు. సమీప గ్రామాలైన బండార్లంక, ఈదరపల్లి, కామనగరువు తదితర పంచాయతీల చెత్తను ట్రాక్టర్లపై మున్సిపల్ డంపింగ్ యార్డ్‌కు తరలించడంపై కౌన్సిల్ పాలకపక్ష కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్ అభ్యంతరం చెప్పారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు కూడా ఇందుకు అభ్యంతరం చెప్పారు. యార్డ్‌ను ఆనుకుని ఉన్న శ్మశాన వాటికకు గతంలో రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించినా, వాటిని సరిగా వినియోగించకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయని వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ అన్నారు. శ్మశాన వాటిక ఏదో, డంపింగ్ యార్డ్ ఏదో తెలియనంతగా ఆ ప్రదేశం చెత్తమయం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 12 వార్డుల ప్రజలు ఈ శ్మశానాన్ని వినియోగిస్తున్నారని కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు ఏడిద శ్రీను అన్నారు. ఆయా వార్డుల ప్రజలు అక్కడికి చేరుకుని, సమస్యలను ఏకరవు పెట్టారు. ఆయా సమస్యల పరిష్కారానికి కౌన్సిల్‌లోని తాము కృషి చేస్తామని 30 మంది కౌన్సిలర్లు ప్రకటించారు. కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుతో ఆయా సమస్యలపై చర్చించారు. వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, కౌన్సిలర్లు అబ్బిరెడ్డి చంటి, దొమ్మేటి రాము, బండారు గోవిందు, నాగారపు వెంకటేశ్వరరావు, కట్టోజు సన్యాసిదాసు తదితరులు డంపింగ్ యార్డ్, శ్మశాన వాటికను సందర్శించి, సమస్యలపై చర్చించారు.



డంపింగ్ యార్డ్, శ్మశాన వాటిక సమస్యలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

సత్తెమ్మ తల్లి జాతరలో సాంస్కృతిక శోభ



జాతరలో గరగ నృత్యాలు



కళాకారుల శక్తివేషాలు

రేపు అమ్మవారి తీర్థం

ముమ్మిడివరం: కోనసీమ ప్రజల ఇలవేల్పయిన సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి సన్నిధి కళలకు పెన్నిధిగా నిలిచింది. అమ్మవారి జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటకాలు, బుర్రకథలు, కూచిపూడి నాట్యం, జానపద గేయాలు, సంగీత విభావరి ఆద్యంతం కట్టిపడేస్తున్నాయి. అమ్మవారి జాతర, తీర్థ ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం అమ్మవారి తీర్థం జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో సుమారు 2 వేల మంది కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ కళాకారులు వివిధ వేషధారణలు, జానపద, గరగ, గిరిజన నృత్యాలతో పాటుచ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



సత్తెమ్మ తల్లి అమ్మవారు

వెంకన్న ఆభరణాలపై గోప్యం తగదు

యానాం: ఏళ్ల చరిత్ర కలిగిన యానాం శ్రీభూ సమేత వేంకటేశ్వర స్వామివారి బంగారు ఆభరణాలపై గోప్యత పాటించడం తగదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారి కల్యాణోత్సవాల నేపథ్యంలో శుక్రవారం ఉత్సవదారులతో ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. స్వామివారి ఆభరణాలపై కోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేలా అధికార యంత్రాంగం సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష మహోన్నతమైనది

ముమ్మిడివరం: అన్ని భాషల్లో తెలుగు భాష మహోన్నతమైనదని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.సాంబమూర్తి అన్నారు. స్థానిక రవీంద్ర విద్యా సంస్థలో శుక్రవారం కళా సాహితీ లలిత కళల సేవా వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన పద్య పఠనం, తెలుగు భాషా మాధుర్యంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

వ్యాస రచన పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక వెత్సావారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అమలాపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృ భాషా దినోత్సవం జరిగింది. పాఠశాల విద్యార్థులకు మాతృ భాష ఎంత గొప్పది అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, హెచ్ఎం బీఆర్ కామేశ్వరరావు బహుమతులు అందజేశారు.



ముమ్మిడివరంలో వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థి

సమష్టిగా శ్మశాన వాటిక అభివృద్ధి

- శివుని విగ్రహానికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: పట్టణంలోని నల్ల వంతెన దిగువన, బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికను పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచేందుకు ఆరు వార్డులకు చెందిన పెద్దలు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఈ శ్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు ఆరు వార్డుల ప్రజలు ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. శ్మశానంలో తపోదీక్షలో ఉన్న శివుని విగ్రహం సైతం నిర్వహణ లేక అస్తవ్యస్తంగా ఉంది. తొలుత ఆ విగ్రహాన్ని పెద్దలు శుక్రవారం పరిశుభ్రపరిచి, క్షీరాభిషేకం చేశారు. మున్సిపాలిటీ నిర్లక్ష్యంతో ఈ శ్మశాన వాటికను డంపింగ్ యార్డ్‌గా మార్చేశారని వారు ఆరోపించారు. శ్మశానాన్ని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి పూర్తిగా తరలించే వరకూ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఇందుకు శనివారం ఉదయం 7.30కు శ్మశాన వాటికకు ఆయా వార్డుల ప్రజలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డ్ తరలింపు, శ్మశాన వాటిక అభివృద్ధిపై కార్యాచరణకు చర్చిస్తామని 29వ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు కముజు రమణ, కాండ్రేగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటికలోని శివుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న పెద్దలు

నేడు బైక్ ర్యాలీ

అమలాపురం రూరల్: బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆ శాఖ పథక సంచాలకులు బి.శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద ఎస్పీ ర్యాలీని ప్రారంభిస్తారన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

అమలాపురం టౌన్: భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలోని జనహిత ఆర్ఎస్ఎస్ భవనంలో ఆది, సోమవారాల్లో ఉదయం 8.30 గంటలకు సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని సంఘ ప్రతినిధి అడ్డాల గోపాలకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మోకాలి, మెడ నొప్పులు, స్పాండిలైటిస్, కాలి తిమ్మిర్లు తదితర సమస్యలకు రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా...

పర్యావరణం కోసం సైకిల్ యాత్ర



అమలాపురంలో సెల్వన్‌తో సీఐ వీరబాబు

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూర్‌కు చెందిన ముత్తా సెల్వన్ చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం అమలాపురానికి చేరింది. ఎమ్మెల్యే ఆనందరావును ఆయన కలిశాడు. స్థానిక గడియారం స్తంభం వద్ద సీఐ పి.వీరబాబును కలిశారు. అన్ని రాష్ట్రాలతో పాటు, బంగ్లాదేశ్, నేపాల్‌ల్లో పర్యటించినట్టు సెల్వన్ తెలిపాడు.

స్కాట్ అండ్ గైడ్స్ యూనిట్ల ప్రారంభం

ఐ.పోలవరం: మండల కేంద్రమైన ఐ.పోలవరం వేగిరాజు నారాయణరాజు జెడ్పీ హైస్కూల్‌లో నూతనంగా స్కాట్ అండ్ గైడ్స్ విభాగాలు శుక్రవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు జి.రాంబాబు, గైడ్ కెప్టెన్ సీహెచ్ వెంకటరాణి ఆధ్వర్యంలో బాలబాలికల విభాగాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎంఈఓ ఎస్.కొండారెడ్డి హాజరయ్యారు.

యూనిఫాంకు ఆర్థిక సాయం

కాట్రేనికోన: కాట్రేనికోన జెడ్పీ హైస్కూల్‌లో స్కాట్ అండ్ గైడ్స్ విద్యార్థుల యూనిఫాం కోసం మురమళ్లకు చెందిన నడింపల్లి సూర్యవర్మ రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో దాతను ఉపాధ్యాయులు సన్మానించారు.

పాఠశాలకు టీవీ అందజేత

యానాం: ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ మానసిక దివ్యాంగ ప్రత్యేక పాఠశాలకు శుక్రవారం కాట్రేనికోన మండలం కందికుప్పకు చెందిన మద్దాల సుబ్బారావు టెలివిజన్ అందజేశారు. ఆయనకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

వంద మందికి వైద్య పరీక్షలు

అమలాపురం రూరల్: చిందాడ గరువులో జేజే రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జంగా రాజేంద్రకుమార్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు.

పంచాయతీ వర్కర్ మృతి



ఈశ్వరరావు(ఫైల్)

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ నీటి సరఫరా విభాగంలో పంపు ఆపరేటర్ అంబటి ఈశ్వరరావు(60) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. అతని భార్య గోవిందమ్మ, కుమారులు సాయిరాం, అరుణ్‌తో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ నేత్రదానంపై అవగాహన కల్పించి, ఈశ్వరరావు కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ-బ్యాంకుకు దానం చేయించారు.

కేంద్ర యోజనపై అవగాహన

యానాం: కేంద్ర పైలెట్ ప్రాజెక్టు అయిన దీనదయాళ్ జన్ ఆజీవిక యోజనపై శుక్రవారం ఆర్ఏఓ ఛాంబర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఏఓ మునిస్వామి ఈ పథకం వివరాలను వెల్లడించారు. అనంతరం పలువురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

యానాం: మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 11 నెలల నుంచి మున్సిపాలిటీ బిల్లులు చెల్లించకపోవడంతో తమకు జీతాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ తమపై వివక్ష ప్రదర్శిస్తున్నారని వారు ఆరోపించారు. పారిశుధ్య వాహనాలను మున్సిపాలిటీ ముందు ఉంచి బైఠాయించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

అమలాపురం టౌన్: పిఠాపురం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిపై దౌర్జన్యం నేపథ్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. ఏపీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల మద్దతుతో ఈ నిరసన తెలిపారు. దౌర్జన్యం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు

తడి, పొడి చెత్త కేంద్రాల ఏర్పాటు

అయినవిల్లి: గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీఓ జి.భీమారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేసి, పంటలకు ఉపయోగించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహర పాల్గొన్నారు.